క్లుప్తంగా

ఘనంగా లక్ష బిల్వార్చన

వీరవాసరం: రాయకుదురు ఉమామూలేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం స్వామివారికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, ప్రత్యేక హోమాలు, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామివారికి మహన్యాస పూర్వక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అడ్డాల వెంకటేశ్వర రావు , నుదురుపాటి భానుమూర్తి, నుదురుపాటి గంగాధర శాస్త్రి, శంకరమంచి కృష్ణ, అడ్డాల బాబి, నుదురుపాటి శ్రీ రామ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

వీరవాసరం: ప్రతి విద్యార్థి చంద్రశేఖర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు వక్తలు తెలిపారు. వీరవాసరం మండలానికి కేరళ డీజీపీ అయిన చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానిస్తున్నట్లు పార్ట్ ఇండియా కోఆర్డినేటర్ జీవీవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ×నేటి సమాజంలో విద్య ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి పార్ట్ ఇండియా జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. పట్టుదలతో కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రతి విద్యార్థి చదవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు చంద్రశేఖర్ ఐపీఎస్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ట్ ఇండియా ప్రతినిధులు మహ్మద్ ఇలియాస్ షరీఫ్, సోమశెట్టి వెంకట్రావు, వీరవాసరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, ఇంచార్జి ఎస్‌వీఎస్‌కె ప్రసాద్, బోను అప్పాజీ, బాజంకి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు తెలిపారు. పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆంధ్రా విద్యార్థి సంఘం, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, అల్లు వంశీ కృష్ణా, ఏవీఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వంశీ కృష్ణా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ బి ఎస్ ఆర్ మనోహర్, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ కె రాగిణి, ఎంబీఏ హెచ్‌వోడీ డీసీహెచ్ రోహిణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం - శ్రీరాంపురం రోడ్డులోని కనకదుర్గ అమ్మవారి 34వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, మహా నివేదన, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసంలో దేవాలయాలు శోభాయమానంగా ఉండేలా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం అనంతరం దేవాదయ శాఖ, మున్సిపల్, మెడికల్, పంచాయతీ, మత్స్య శాఖ అధికారులతో కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షించారు. గునుపూడి సోమేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టాలని భీమవరం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే కార్తీక మాసంలో సముద్ర స్థానాలను ఆచరించడం కూడా జరుగుతుందని, పేరుపాలెం బీచ్‌లో ఇందుకు తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. బీచ్‌లో స్నానం ఆచరించే వారికి ప్రమాదాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి, డీపీఓ, జిల్లా వైద్యాధికారి, భీమవరం మున్సిపాలిటీ మేనేజర్, మత్స్య శాఖ ఏడి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికకు రెండు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ బాబూరావు సోమవారం చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలోని ఉమ్మడి పంట బోదెలో ఐస్ ఫ్యాక్టరీ వ్యర్థనీరు వదిలి, అదే ప్రాంతం గుండా త్రీ ఫేస్ వైర్ల వేసి ఇబ్బందులకు గురిచేస్తూ నీటి కలుషితానికి పాల్పడుతున్న సరిహద్దు ఐస్‌ఫ్యాక్టరీ కోల్డ్ స్టోరేజీపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతు తోట సూర్యారావు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్థానికంగా చిన పల్లివీధిలో తిరుమలశెట్టి నాగలక్ష్మి ఒంటరి మహిళగా జీవిస్తున్న తనకు నివశినా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- ప్రజాజీవనానికి అంతరాయం
- ముంపులో తీర ప్రాంతం
- రహదారులు జలమయం
- ముంపుకు గురైన గుడిసెలు



ఆకివీడు ప్రధాన సెంటర్‌లో భారీ వర్షానికి జలమయమైన జాతీయ రహదారి



చినమిల్లిపాడులో భారీ వర్షానికి ముంపుకు గురైన భవనం



ఉండిలో నీటమునిగిన ఇంట్లోనే దిలుగా కూర్చున్న వ్యక్తి



ఉండి గోరింతటలో నీటమునిగిన ప్రాథమిక పాఠశాల

ఆకివీడు: భారీ వర్షం జనజీవనానికి తీవ్ర అంతరాయం కల్పించింది. కుండపోత వర్షానికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. వర్షాకాలంలో కూడా కురవనటువంటి వర్షం శీతాకాలం ఆరంభంలో దంచికొట్టింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు ముంపునీరు ఇళ్లల్లోకి చొచ్చుకువచ్చింది. నియోజకవర్గంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ కుండపోత వర్షం 341.8 మిల్లీమీటర్లు నమోదు అయింది.

కాలువలను తలపించేలా రోడ్లు

స్థానిక పట్టణంలోనూ, గ్రామాల్లోనూ,మండల కేంద్రాల్లో కురిసిన వర్షంతో రోడ్లన్నీ తెల్లెక్కిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తెరిపిలేకుండా కురిసిన వర్షానికి డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. రోడ్లమీద అడుగులోతు నీరు నిలబడి పోయింది. స్థానిక జాతీయ రహదారిపై ఎప్పుడూ లేని విధంగా ప్రధాన సెంటర్ నుంచి ఎస్ టర్నింగ్ వరకూ కాలువను తలపించేలా వర్షపు నీరు నిలబడిపోయింది. మండలంలోని చినమిల్లిపాడు, కమతవాని గూడెం, కుప్పనపూడి, పెదకాపవరం, చినకాపవరం, తదితర గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు నీట మునిగాయి.

పంటపొలాల్ని ముంచెత్తనున్న ముంపునీరు

భారీ వర్షంతో కురిసిన ముంపునీరు పలు గ్రామాల్లోని వరి చేలల్లోకి చొచ్చుకువెళ్తున్నాయి. దీంతో వరి చేలల్లో భారీగా నీరు నిలబడుతోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ పంట పొలు, పొట్ట దశలోనూ, విత్తనాల ధాన్యం సాగు కోత దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఈదురు గాలులు వీస్తే పంట నేలకొరిగి మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లోతట్టు తీరంలోని పలు గ్రామాల్లో వరి చేలు చుతలు కన్పిస్తున్నాయి.

కల్లోలంలో చినమిల్లిపాడు

కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు అతలాకుతలమవుతోంది. కొల్లేరు ముంపునీటితో పాటు, భారీ వర్షంకు కురిసిన వాననీటితో రోడ్లు జలమయమయ్యాయి. కొల్లేరు ముంపు ఉధృతి మరింత తీవ్రంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పలు ఇళ్లల్లోని నీరు చొచ్చుకువచ్చిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. తమ గ్రామాన్ని పట్టించుకున్న నాథుడులేడని వాపోతున్నారు.

ముంచెత్తిన భారీ వర్షం

ఉండి: మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. సుమారు ఉదయం11 గంటల వరకు కూరుస్తూనే ఉండటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నియోజకవర్గ కేంద్రం ఉండిలో మరింత భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ వర్షపునీటితో ముంపుకు గురైయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యమైన మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయం, పోలీస్‌స్టేషన్, డ్వాక్రా కార్యాలయాలకు వెళ్లే రహదార్లు పూర్తిగా మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కోండ్రోతు పేట, శివాలయం, ఎంపీపీ స్కూల్‌కు వెళ్లే రహదారి ఓపెద్ద కాలువలా మారిపోయింది. ఈ రోడ్డులోని వర్షపునీరు సాయంత్రం అయినా బయటకు వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే ప్రాంతంలోని ఓ ఇళ్లు పూర్తిగా వర్షపునీటితో నిండిపోయింది. స్థానికంగా ఉండే డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించి పోవడంతో ఇంట్లోని నీరు బయటకు వెళ్లక కుటుంబికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉండి శివారు గోరింతోటలో ప్రాథమిక పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వర్షపు నీటిలోనే నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. స్కూల్‌లోని నీరు బయటకు వెళ్లకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మా గ్రామాన్ని పట్టించుకోండి



దుక్కి వర్షానికే గ్రామంలోని రోడ్లన్నీ నీట మునుగుతున్నాయి. కొల్లేరు తీరంలో ఉన్న తమ గ్రామంను కొల్లేరు సరస్సు ముంపునీరు ముంచేస్తుంది. ఇళ్లల్లోకి నీరు చొచ్చుకువస్తుంది. పంట పొలాలు నీట మునుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాన్ని పట్టించుకోవాలి.

–మద్దా సునిల్ కుమార్, చినమిల్లిపాడు.

ఎడతెరిపి లేని వర్షం.. ప్రయాణికుల ఇక్కట్లు



కాళ్ళలో రాష్ట్రీయ రహదారి పై నిలిచిన వర్షపు నీరుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కాళ్ల: అల్ప పీడన ప్రభావంతో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్ని జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలవలను తలపిస్తున్నాయి. రహదారులపై మోకాళ్ల లోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్, శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచింది. అసలే అధ్వానంగా ఉన్న రాష్ట్రీయ రహదారి వర్షంతో అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పట్టారు.



భీమవరంలో నీటమునిగిన ఆర్టీసీ డిపో

కుండపోత వర్షంతో అవస్థలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. తెల్లవారు జాము నుంచి 11 గంటలవరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షానికి భీమవరం ఆర్టీసీ డిపో ముంపుకు గురైంది. దీంతో గ్యారేజీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చినపాటి వర్షానికే డిపో ముంపుకు గురువుతున్న కూడా ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదు.



భీమవరంలో భారీ వర్షానికి నీట మునిగిన 8వ వార్డు

స్వదేశీ వస్తువులను వినియోగించాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): స్వదేశీ వస్తువులను ప్రజలు విరివిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వాణిజ్య పనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్‌హెచ్‌జీ మహిళల ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి శైలజ, జిల్లా హ్యాండ్లూమ్స్ అధికారి ఏ.అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మనోజ్ వుడ్ వర్క్, కె.ఇల్లిందలపర్రు, చింతపర్రు సొసైటీ చేనేత వస్త్రాలు, మంచిలి శ్రీ పద్మ పూతరేకులు, కొమరవరం శ్రీ దుర్గా పచ్చళ్ళు తయారీదారులు, తదితరులు పాల్గొన్నారు.

17న శ్రీధన్వంతరి జయంతోత్సవాలు



భీమవరంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: నాయి బ్రాహ్మణ జెఏసి ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది నుంచి భీమవరంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయి బ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి, భీమవరం అధ్యక్షుడు కోడూరి రామకృష్ణ చెప్పారు. సోమవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ప్రప్రథమ అయుర్వేద వైద్యుడు ధన్వంతరేనన్నారు. ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా ఈనెల 17వ తేదీన ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉచిత హోమియో, ఆయుర్వేదం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెఏసి గౌరవాధ్యక్షుడు పిప్పళ్ల ప్రసాద్, మల్లువలస సత్యనారాయణ, మల్లువలస రాము, పాట్నూరి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్

భీమవరం అర్బన్: రాష్ట్రంలో నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ హెచ్చరించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ గ్రామంలో సోమవారం దళిత ఐక్య వేదిక జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం తయారు చేయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతుందన్నారు. కల్తీ మద్యం అరికట్టకపోతే కూటమి ప్రభుత్వంపై దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాయని హెచ్చరించారు. అణగారిన వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం అరికట్టకపోతే దళిత సంఘాలను సమీకరించి పెద్దెత్తున ఉద్యమానికి తెరలేపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎం సోమయ్య, పట్టా రామారావు, షేక్ సలీమా, పి. స్వరూపారాణి, టి. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం



నీట మునిగిన పీఎల్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల

ఆకివీడు: భారీ వర్షానికి స్థానిక పులవర్తి లక్ష్మణ స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం, క్రీడా ప్రాంగణంలు నీట మునిగాయి. కుండపోత వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు భారీగా చేరింది. ఇటీవల ఆవరణలో దాతల సహకారంతో షెడ్లు నిర్మించారు. మిగిలిన ప్రదేశం లోతట్టుగా ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేక నిలిచిపోయింది. దీంతో విద్యార్థులకు అసౌకర్యం ఏర్పడింది. పాఠశాల క్రీడా ప్రాంగణం కూడా భారీ వర్షానికి నీట మునిగింది. ఖాళీ ప్రదేశంలో భారీగా నీరు నిలబడటతో విద్యార్థులు ఆడుకునేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. క్రీడా ప్రాంగణాన్ని వెంటనే చదును చేయించి, ఆటలకు అనుకూలంగా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ



రాయకుదురులో సంతకాల సేకరణ దృశ్యం

వీరవాసరం: పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని భీమవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా రాయకుదురు, చింతలకోట గరువు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి, మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు ,భీమవరం టౌన్ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, రాయకుదురు గ్రామ పార్టీ అధ్యక్షులు సర్వేశ్వరరావు ,మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ సత్తార్ సాహెబ్ , వీరవల్లి శ్రీనివాస రావు, ఆవాల శ్రీనివాసరావు, కుసుమే ఆనందరావు, చింతపల్లి పండు, గెడ్డం రత్నరాజు, సీహెచ్ భీమరాజు ,కొమ్మన శ్రీనివాసరావు, దాసరి మాణిక్యాలరావు, జోగి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్ ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



భీమవరం పట్టణం ప్రకాష్‌నగర్ ఎస్టీ కాలనీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని 29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్టీ కాలనీలో మంచినీరు, డ్రెయినేజీ, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, ఎం వైకుంఠరావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా వర్షం నీరు వేళ్లే మార్గం లేక ఇళ్లల్లోకి నీరు చేరిపోయి దోమలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌కు అనేక పర్యాయాలు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాష్‌నగర్‌లో నేటికీ అనేకమందికి వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని డ్రెయినేజీ, మంచినీరు, వీధిలైట్స్, వ్యక్తిగత మరుగుదొడ్లు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి త్రిమూర్తులు, సంజీవరావు, హక్కులయ్య, దుర్గారావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు సంబరం



వీరవాసరంలో ఏనుగు సంబరం దృశ్యం

వీరవాసరం: వీరవాసరంలో ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఏనుగు సంబరం సోమవారం అత్యంత ఘనంగా ప్రారంభించారు. మేళ, తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య బేతాళునిని ఏనుగుపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కోబ్రా డాన్సులు, తీన్మార్ నృత్యాలు జానపద కళారూపాల ప్రదర్శనలు, కోయ నృత్యాలు ,వివిధ రకాల బ్యాండ్ మేళాలతో ఏనుగు సంబరం అత్యంత ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున పోలీస్ బందోబస్తుతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ భీమవరం ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, సర్పంచ్ చికిలే మంగతాయారు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో కాలువను అనుకుని ఉన్న భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని అదే గ్రామానికి చెందిన కడలి దుర్గారావు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి వేంద్ర శివారు వైన్ షాప్ దగ్గర ఉన్న పిల్లకాలువ ఆర్ఎస్ నెంబర్ 145, 162, 163, 164 గల భూములు భూపతి రాజు రాంబాబు కాలువ భూములను ఆక్రమణ చేసి ఉన్నారని దీనికి సంబంధించి గతంలో పీజీఆర్ఎస్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు చేపట్టలేదని, అదేవిధంగా గ్రామ శివారులో ఉన్న ఓఎన్‌జీసీ గ్రౌండ్ దగ్గర ఆర్ఎస్ నెంబర్ 161/2 బి లో 2-93 సెంట్ల భూమిని భోగిరెడ్డి శ్రీనివాసరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు ఆక్రమించి ఆ భూమిని లేఅవుట్లు చేసి సెంటు రూ.3 లక్షల చొప్పున అమ్ముకున్నారని దీనికి సంబంధించి మండల తహసీల్దార్ వారికి ఏ విధమైన కన్వర్స్ ఫీజు చెల్లించలేదని, అక్రమ లేఅవుట్లో ఇళ్లు నిర్మించుకున్న పంచాయతీ అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఆక్రమణ భూములపై విచారణ చేపట్టి క్రింది స్థాయిలో అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.